# భారతదేశ చరిత్ర

## గవర్నర్ జనరల్స్, వైస్రాయ్‌లు

ఆంగ్లేయులు భారతదేశాన్ని ప్రెసిడెన్సీలుగా విభజించి గవర్నర్లను అధికారులుగా నియమించారు. వీరిలో వారన్ హేస్టింగ్స్, లార్డ్ కారన్ వాలీస్, లార్డ్ వెల్లస్లీ, లార్డ్ మింటో, విలియం బెంటింక్ ముఖ్యులు. వారు ప్రవేశపెట్టిన వివిధ సంస్కరణలు, చేసిన చట్టాలు, యుద్ధాలు, సంధులు అనేక సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పులకు కారణమయ్యాయి.

ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించి వారి పాలనా విధానాలను ప్రవేశపెట్టారు. 1773లో రెగ్యులేటింగ్ చట్టాన్ని ప్రవేశపెట్టి పాలనాపరమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. భారతదేశాన్ని ప్రెసిడెన్సీలు, జిల్లాలు, తాలూకాలుగా విభజించి మద్రాస్, బొంబాయి, కలకత్తా ప్రెసిడెన్సీలను ఏర్పాటు చేసి గవర్నర్‌లను అధికారులుగా నియమించారు. జిల్లాకు కలెక్టర్‌ను, తాలూకాలకు తహసీల్దారులను నియమించి పరిపాలించారు.

- 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా బెంగాల్ గవర్నర్ జనరల్ పదవిని ఏర్పాటు చేశారు. అతడికి మద్రాస్, బొంబాయి, కలకత్తా ప్రెసిడెన్సీలపై సర్వాధికారాలను కల్పించారు. వారన్ హేస్టింగ్స్‌ను మొదటి బెంగాల్ గవర్నర్ జనరల్‌గా నియమించారు. 1833 చార్టర్ చట్టం వరకు బెంగాల్ గవర్నర్ పదవి కొనసాగింది. చివరి బెంగాల్ గవర్నర్ జనరల్ విలియం బెంటింక్.

### వారన్ హేస్టింగ్స్ (1772 - 85)

- ఇతడు 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా బెంగాల్ మొదటి గవర్నర్ జనరల్‌గా ఎన్నికయ్యాడు.
- రాబర్ట్ క్లైవ్ బెంగాల్‌లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేసి, భూమి శిస్తు వసూలు కోసం 'వేలం పద్ధతి'ని ప్రవేశపెట్టాడు. రెవెన్యూ బోర్డును ఏర్పాటుచేసి, భూమి శిస్తు వసూలు కోసం తొలిసారిగా కలెక్టర్ అనే పదవిని సృష్టించాడు. వీరికి సహాయంగా భారతీయ దివాన్లను నియమించి బెంగాల్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. హిందూ న్యాయశాస్త్రాలను పర్షియన్ భాషలోకి అనువదించాడు.
- కలకత్తాలో సదర్ దివానీ అదాలత్ అనే సివిల్ న్యాయస్థానాన్ని, సదర్ నిజామత్ అదాలత్ అనే క్రిమినల్ న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి బెంగాల్‌లో సన్యాసి ముఠాలను నిర్మూలించాడు.
- అయోధ్య పాలకుల నుంచి కాశీ రాజ్యాన్ని పొంది, ఆంగ్ల సామ్రాజ్యంలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో రోహిల్లా యుద్ధం (1774), మొదటి ఆంగ్ల-మరాఠా యుద్ధం (1775 – 82), రెండో మైసూర్ యుద్ధం (1780 – 84) జరిగాయి.
- 1774లో కలకత్తాలో తొలి సుప్రీంకోర్టును ఏర్పాటుచేశారు. (ఫెడరల్ న్యాయస్థానం) జస్టిస్ ఎలిజా ఇంఫేను తొలి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు.
- 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కీ భారత తొలి పత్రిక 'బెంగాల్ గెజిట్'ను ప్రారంభించాడు.
- వారన్ హేస్టింగ్స్ కాలంలోనే విలియం జోన్స్ అధ్యక్షతన 'ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' అనే సంస్థను ఏర్పాటుచేశారు. చార్లెస్ విల్కిన్స్ భగవద్గీతను, జోన్స్ కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆంగ్లంలోకి అనువదించారు.
- స్వదేశీ సంస్థానాలు, భారతీయ రాజ్యాల విషయంలో వలయబద్ధ విధానాన్ని అవలంబించాడు.

### సర్ జాన్‌షోర్ (1793 - 98)

- 1793లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా నియమితుడై స్వదేశీ రాజులతో తటస్థ విధానాన్ని అనుసరించాడు. ఔధ్ రాజ్యం విషయంలో మాత్రం తటస్థ విధానాన్ని విడనాడి జోక్యం చేసుకున్నాడు.
- హైదరాబాద్ నిజాం, నానాఫడ్నవీస్‌ల మధ్య జరిగిన ఖర్ధా యుద్ధం ఇతడి కాలంలోని ముఖ్య సంఘటన.

### సర్ జార్జి బార్లో (1805 - 1807)

- 1805 జులై – అక్టోబరుల మధ్య కారన్ వాలీస్ మళ్లీ బెంగాల్ గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. ఇతడి తర్వాత సర్ జార్జి బార్లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు.

- ఇతడి కాలంలో 1806లో నెల్లూరు సిపాయిల తిరుగుబాటు జరిగింది. 100 మంది ఆంగ్లేయులు మరణించారు. రెండో ఆంగ్ల – మరాఠా యుద్ధం ఇతడి కాలంలోనే ముగిసింది.

**లార్డ్ మింటో / మొదటి మింటో (1807 - 13)**

- చార్లెస్ మెట్‌కాఫ్‌ను రంజిత్ సింగ్ వద్దకు పంపిన లార్డ్ మింటో అతడితో 1809లో అమృత్‌సర్ సంధి చేసుకున్నాడు.
- 1808లో పర్షియా దేశానికి మాల్కంను రాయబారిగా పంపాడు. (మాల్కం మధ్య ఇండియా గాథలు (Memories of Central India) అనే గ్రంథం రాశాడు.)
- ఎల్ఫిన్‌స్టన్‌ను కాబూల్‌కు రాయబారిగా పంపాడు.
- 1810లో యమునా నది కాలువల స్థితిగతులను అధ్యయనం చేయడానికి కమిటీని నియమించాడు.
- భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాలనే నిర్ణయం ఇతడి కాలంలోనే జరిగింది. 1813 చార్టర్ చట్టం ద్వారా విద్యాభివృద్ధికి ఏటా లక్ష రూపాయలు కేటాయించాడు.

**లార్డ్ హేస్టింగ్స్ (మార్క్విస్ ఆఫ్ హెమ్మింగ్ హేస్టింగ్స్) (1813 - 23)**

- సామంత సంబంధ నిరోధక విధానాన్ని (Policy of subordinate Isolation) అనుసరించాడు. ఇతడి కాలంలో 1814–16 మధ్య నేపాల్/ గూర్ఖా యుద్ధం, మూడో ఆంగ్ల – మరాఠా యుద్ధం (1818) జరిగాయి.
- థామస్ హిస్లాప్ నాయకత్వంలో పిండారీలు అనే దారి దోపిడీ దొంగలను, పఠానులను అణచివేశాడు.
- సతారా రాజధానిగా చిన్న మహారాష్ట్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసి శివాజీ వారసుడైన ప్రతాప్‌సింగ్‌ను రాజుగా నియమించాడు.
- 1800లో థామస్ మన్రో ప్రవేశపెట్టిన రైత్వారీ విధానాన్ని బొంబాయి, మద్రాస్ ప్రెసిడెన్సీల్లో విస్తరింపజేశాడు.
- 1817లో హిందూ కళాశాలను కలకత్తాలో స్థాపించాడు.
- నేపాల్ పాలకుడు అమర్‌సింగ్‌తో సగౌలీ సంధి చేసుకున్నాడు.
- జేమ్స్ థామ్సన్ వాయవ్య రాష్ట్రంలో మహల్వారీ విధానాన్ని ప్రవేశపెట్టాడు. (ఈ విధానాన్ని హోల్ట్ మెకంజీ నివేదిక ప్రకారం ప్రవేశపెట్టారు)
- ఇతడి కాలంలోనే 1818లో 'సమాచార దర్పణ్' అనే బెంగాలీ పత్రికను ప్రారంభించారు.
- లెఫ్టినెంట్ బ్లేక్ ఇతడి కాలంలోనే పశ్చిమ జమునా కాలువ పనులను పునరుద్ధరించి ఢిల్లీకి తాగునీటి వసతిని కల్పించాడు.
- హేస్టింగ్ వల్ల ఇండియాలో బ్రిటిష్ సార్వభౌమాధికారం శాశ్వతంగా స్థిరపడిందని జె.ఎస్.మిల్ పేర్కొన్నారు.

**విలియం బెంటింక్ (1828 - 35)**

- చిట్ట చివరి బెంగాల్ గవర్నర్ జనరల్, మొదటి భారతదేశ గవర్నర్ జనరల్‌గా ప్రసిద్ధిచెందాడు.
- 1803లో మద్రాస్ గవర్నర్‌గా, 1828లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా, 1833లో తొలి భారతదేశ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు.
- కారన్ వాలీస్ స్థాపించిన సంచార న్యాయస్థానాలను రద్దుచేసి, భారతీయులకు న్యాయస్థానాల్లో ఉన్నత పదవులు కల్పించాడు. బెంగాల్ న్యాయస్థానాల్లో జ్యూరీ పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఉన్నత న్యాయస్థానాల్లో ఆంగ్లాన్ని, దిగువ న్యాయస్థానాల్లో పర్షియన్ భాషను కొనసాగించాడు. న్యాయస్థానాల్లో మాతృభాషను అనుమతించాడు.
- రాబర్ట్ బర్డ్ అధ్యక్షతన అలహాబాద్‌లో రెవెన్యూ బోర్డ్‌ను స్థాపించాడు.
- మెకాలే కమిటీ నివేదిక ప్రకారం 1835, మార్చి 7న భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాడు.
- కలకత్తాలో ఒక వైద్య కళాశాలను స్థాపించాడు (ఫోర్ట్ విలియం కళాశాల – వెల్లస్లీ).
- 1829, డిసెంబరు 4న సతీ సహగమనాన్ని రద్దుచేశాడు.

- విలియం స్లీమన్ నాయకత్వంలో థగ్గులు అనే దారి దోపిడీ దొంగలను నిర్మూలించాడు.
- ఇతడి కాలంలోనే తొలిసారిగా ఇండియా – ఇంగ్లండ్‌ల మధ్య ఆవిరి నౌకను ఏర్పాటుచేశారు.
- కథియవాడ్ ప్రాంతంలో స్త్రీ, శిశు హత్యలను నిషేధించాడు.
- మాళ్వా, బొంబాయి మధ్య నల్ల మందు వ్యాపారాన్ని చట్టబద్ధం చేశాడు.
- రాబర్ట్ బర్డ్ నివేదికను అనుసరించి వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో నూతన శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టాడు.

## లార్డ్ వెల్లస్లీ (1798 - 1805)

- భారతదేశానికి బ్రిటిష్ వారిని సార్వభౌములుగా చేయాలనే ప్రధాన లక్ష్యంతో పనిచేశాడు.
- ఇతడి పూర్తి పేరు మార్క్వెస్ వెల్లస్లీ. 'ఎరల్ ఆఫ్ మార్నింగ్‌టన్'గా ప్రసిద్ధి చెందాడు.
- వెల్లస్లీ సోదరుడైన ఆర్థర్ వెల్లస్లీ సర్వ సైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు. ఇతడిని 'డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్' అనేవారు.
- ఐరోపాలో నెపోలియన్ బోనపార్టీని, భారతదేశంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించడంలో ప్రధాన పాత్ర పోషించాడు.
- లార్డ్ వెల్లస్లీ 1798లో 'సైన్య సహకార పద్ధతి'ని ప్రవేశపెట్టాడు. ఇందులో చేరిన తొలి భారతీయ పాలకుడు హైదరాబాద్ నిజాం అలీ. ఇతడు 1800లో దత్త మండలాలను బ్రిటిష్ వారికి అప్పగించాడు.
- సైన్య సహకార పద్ధతిలో చేరిన తొలి హిందూ చక్రవర్తి కృష్ణరాజ వడయార్. 1801లో అయోధ్య పాలకుడు (వజీర్ అలీ), 1802లో పీష్వా రెండో బాజీరావు, 1803లో మొగల్ చక్రవర్తి రెండో షా ఆలం ఇందులో చేరారు.
- సైన్య సహకార పద్ధతిలో చేరిన భారతీయ పాలకులు మూడు ముఖ్యమైన షరతులను పాటించాలి. అవి:
  1. బ్రిటిష్ సైన్యానికి అయ్యే ఖర్చు మొత్తం భరించాలి.
  2. తన రాజ్యంలో కొంత భాగాన్ని బ్రిటిష్ వారికి ఇవ్వాలి.
  3. బ్రిటిష్ అధికారి (బ్రిటిష్ రెసిడెంట్) తన రాజ్యంలో ఉండటానికి వసతులు కల్పించాలి.
- చరిత్రకారులు సైన్య సహకార పద్ధతిని "కోసుకు తినే తరుణం వచ్చే వరకు మనం ఎద్దుల్ని మేపినట్లుగా మిత్రుల్ని మేపి మింగేసే పద్ధతి"గా అభివర్ణించారు.
- వెల్లస్లీ కాలంలో నాలుగో మైసూర్ యుద్ధం (1799), రెండో ఆంగ్ల – మరాఠా యుద్ధం (1803 – 05) జరిగాయి.
- దుష్పరిపాలన నెపంతో సూరత్, తంజావూరు, కర్ణాటక ప్రాంతాలను వెల్లస్లీ బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేసి, మద్రాసు రాష్ట్రాన్ని ఏర్పాటు చేశాడు.
- కలకత్తాలో కంపెనీ ఉద్యోగులకు శిక్షణ నిమిత్తం ఫోర్ట్ విలియం కళాశాలను నెలకొల్పాడు. తనని తాను 'బెంగాల్ పులి'గా ప్రకటించుకున్నాడు.

## లార్డ్ కారన్‌వాలీస్ (1786 - 93)

- అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్ల సైన్యాలకు నాయకత్వం వహించి, జార్జి వాషింగ్టన్ నాయకత్వంలోని వలస సైన్యాల చేతిలో ఓటమి పాలయ్యాడు.
- 1786లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు.
- భారతీయులు అవినీతిపరులు కాబట్టి వారిని ఉన్నత ఉద్యోగాల్లో నియమించకూడదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు.
- గ్రామ పంచాయతీ వ్యవస్థలను రద్దు చేసి, నాలుగు సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేశాడు.
- సర్ జార్జి బార్లో, జస్టిస్ ఎలిజా ఇంఫేల సహాయంతో 'కారన్ వాలీస్ కోడ్' పేరుతో న్యాయ సంస్కరణలను అమలు చేశాడు. భారతీయ న్యాయస్థానాల్లో ఆంగ్ల న్యాయశాస్త్రాల ప్రకారం తీర్పు చెప్పే పద్ధతిని ప్రవేశపెట్టాడు.
- 1793లో శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి లేదా జమీందారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు.

- సర్ జాన్ షోర్, జేమ్స్ గ్రాంట్‌ల సహాయంతో శాశ్వత శిస్తు విధానాన్ని ఏర్పాటు చేశాడు.
- కారన్ వాలీస్ భారతదేశంలో సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు.
- మూడో మైసూరు యుద్ధంలో (1790 – 92) టిప్పుసుల్తాన్‌ను ఓడించి, 1792లో అతడితో శ్రీరంగపట్నం సంధి చేసుకున్నాడు.
- 1791లో జొనాథన్ డంకన్ బనారస్ సంస్కృత కళాశాలను స్థాపించాడు.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net
www.eenadupratibha.net